"నాకు అంతా శాంతే. మా ఆవిడే డెబ్బయి కేజీలుంది. దాని పేరు శాంతమ్మ; నీకు తెలుసుగా?"

"అదికాదు శంకరం-" అని ఏదో, అతనన్నమాటకి నేను సంజాయిషీ చెప్పబోయాను.

"ఇంకేమీ అనకు. నాకేం లోటు లేదు. మా ఆవిడ అహల్యనీ, ఇద్దరు తారలనీ మించిన పతివ్రత" - అని శంకరం ఏదో చెప్పేస్తూవుంటే - లాస్టు బస్సు కింకా టైముందని నేను లేచి బయల్దేరి బళ్ళాండు కొచ్చేశాను. ★

# 90. దొరకునా, ఇటువంటి దొంగ?

**మా** స్నేహితుడు సత్యప్రసాదూ నేనూ ఓసారి ఏదో అపురూపమైన పుస్తకం కోసం రామమోహన బుక్ షాపుకి వెళ్లేం. షోకేసులో ఉన్న పుస్తకాల వరసలన్నీ వెతికినా మాకు ఆ పుస్తకం కనిపించక పోయేసరికి అక్కడున్న సేల్సుమన్‌ని ఫలానా పుస్తకం ఉందా అని అడిగాం. "ఆ పుస్తకం కాపీలన్నీ అయిపోయాయనుకుంటానండీ. ఐనా ఓసారి లోపలి గదిలోకి వెళ్లి మా ప్రొప్రయిటరు గార్ని అడగండి" అన్నాడా అబ్బాయి. ఆ విధంగా ఆ షాపు ప్రొప్రయిటరు గారి దర్శనం అవుతోంది కదా అని సరదాపడుతూ లోపలిగదిలోకి వెళ్లాం. ప్రొప్రయిటర్‌గారు కూడా మా దర్శనం అయినందుకు సరదా పడిపోయి, "పుస్తకం సంగతి తరవాత ఆలోచిద్దాం. ముందు కాఫీ తాగండి!" అని మా కిద్దరికీ చెరో స్టెయిన్ లెస్ స్టీల్ గ్లాసులోనూ కాఫీ పోయించి ఇప్పించేరు. ఉన్నట్టుండి సత్యప్రసాద్ "హి హి హి. భలే రాయించేరే!" అన్నాడు; తను పట్టుకున్న గ్లాసుమీదున్న అక్షరాలు చూపిస్తూ.

"ఈ గ్లాసు రామమోహన బుక్‌షాపు నుండి దొంగిలించడ మైనది." అని వుంది, ఆ గ్లాసుమీద. నేను నా(కిచ్చిన) గ్లాసు చూస్తే దానిమీద కూడా అలాగే వుంది.

"ఇక్కడికొచ్చి కాఫీలు తాగే పెద్ద మనుషుల్లో ఎవరయినా ఆ గ్లాసులు సంచీల్లో పెట్టుకుని చల్లగా జారుకుంటారనుకోండి; తీరా ఇళ్లకెళ్లేక చూసుకుంటే ఈ రాత కనబడి నవ్వూ ఏడుపూ కలిసికట్టుగా వొచ్చేస్తాయి.." అని సత్యప్రసాద్ ఆ రచనకి వ్యాఖ్యానం చేసేడు.

ఇంకోసారి రమణారావూ నేనూ ఒక హోటలుకి వెళ్లాం. మేం ఆర్డరిచ్చిన ప్రకారం సర్వర్ ఇడ్లెన్లు తెచ్చాడు. "అబ్బా! ఎంత చిన్నవి చేసేరో. ముద్దొస్తున్నాయి కదూ!" అన్నాను. ఆ ఇడ్లెన్ల సైజు రమణారావుకి చూపించి.

ఇడ్లెన్లు ఒక్కొక్క ప్లేటు తీసుకుందామని వెళ్లిన మేం చెరో నాలుగు ప్లేట్లూ తినవలసి వచ్చిందంటే అది ఆ ఇడ్లెన్ల సైజు వల్లనే తప్ప రుచి వల్ల కానే కాదని నేను తీర్మానించుకున్నాను.

ఆ తరవాత మేం కాఫీలు రప్పించుకున్నాం. కాఫీ తాగడం ఇలా మొదలెట్టేమో లేదో, అలా చెంగున వెళ్లి బిల్లు తెచ్చి అక్కడ పెట్టేడు సర్వరు. "అవును గానీ, నటేశం; ఈ కప్పులు ఎక్కడ కొన్నారో చెప్తావా, ప్లీజ్; నీకు పుణ్యాం వుంటుంది." అని రమణారావు సర్వర్ని బ్రతిమాలి అడిగాడు.

"ఆ వివరాలన్నీ మీకెందుకంట!" అన్నాడు సర్వర్; బిల్లు కాగితం ఎగిరిపోకుండా దానిమీద మంచినీళ్ల గ్లాసు వుంచి.

"మరేం లేదు. మా ఇంటికి ఎవరైనా వచ్చినప్పుడు కాఫీ ఇస్తాం కదా. ఎంత చిన్న కప్పుల్తో ఇచ్చినా; వాట్లోకూడానూ సగానికి చొప్పునే పోసి ఇచ్చినా "అంత కాఫీ ఎందుకండీ బాబూ, ఇప్పుడే తాగొచ్చేం" అనడం రివాజయిపోయింది. "రామ రామ! మీరేమిటి, తాగడమేమిటీ" అని మేం ఎంత మొత్తుకున్నా వినిపించుకోక ఇచ్చిన నాలుగు చుక్కల కాఫీలోనూ రెండు చుక్కలు స్టయిలుగా వొదిలేస్తున్నారోయి. నువ్వుగానీ ఈ కప్పులు ఎక్కడకొన్నారో ఆ షాపు ఎడ్రసుగాని చెబితివట్టాయనా మేం కూడా ఆ షాపుకెళ్లి చెరో అరడజను కప్పులూ కొని తెచ్చుకుంటాం. ఈ సైజు కప్పుల్తో ఇంటి కొచ్చిన వాళ్లకి కాఫీలు గాని ఇచ్చేం అంటే వాళ్లు ఒక్క చుక్కకూడా వదలకుండా తాగడమే కాకుండా కప్పుల్లో నాలుకలు పెట్టి నాకేస్తారని అనిపిస్తోంది." అన్నాడు రమణారావు. ఇలా ఎంత (కన్‌విన్)సింగ్ గా అడిగినా వాళ్లు ఆ కప్పులెక్కడ అమ్ముతున్నారో ఆ ఎడ్రస్ మాత్రం చెప్పేరేకాదు.

ఆ తరవాత కొన్నాళ్లకి నేను రమణారావు ఇంటికి వెళ్లినప్పుడు అతని ఇల్లాలు నాకూ అతనికీ కాఫీలు పోసిచ్చిన కప్పులు చూసి గొప్ప సరదాపడిపోయాను. ఎందుకంటే అవి ఆ హోటల్ కప్పులంతేసే ఉండడం ఒకటీనీ, వాటిమీద "హోటల్ వింధ్యా" అని అందమైన పచ్చబొట్టు లాంటి ప్రింటింగు ఉండడం ఒకటీనీ.

"ఈ కప్పులు ఎక్కడ కొన్నారో అడ్రస్ చెప్పమంటే చెప్పలేదు వాళ్లు. అంచేత వాళ్లముద్ర వుంటేనేంలే అని ఆరు కప్పులు డైరెక్టుగా హోటలు వింధ్యా నుండే కొనేశావన్నమాట!" అన్నాను. రమణరావు తల నిలువుగా అడించేడు. "మరి నాక్కూడా ఓ ఆరుకప్పులు కొనవలిసింది!" అని నేను నిష్ఠూరం అడితే అప్పుడు చెప్పేడు అసలు కథ.

"నువ్వూ నేనూ అడిగినప్పుడు కాక మళ్లా నేను రెండు మాట్లువిడిగా వెళ్లి అడిగినా వాళ్లు ఆ షాపు అడ్రస్ చెప్పలేదు. ఇంతలోకే మా మేనేజర్ రిటైర్మెంటు రూపంలో ఒక సువర్ణావకాశం వచ్చింది. ఆ ఫేర్ వెల్ పార్టీ హోటల్ వింధ్యా వాళ్లకి కాంట్రాక్టు ఇప్పించేను. వాళ్లకి బుధవారం సెలవు కనక ఒప్పుకుని ప్లేట్లూ చెమ్చాలూ సాసర్లూ అన్నీ మా ఆఫీసుకి తెచ్చేరు. పార్టీ ప్రారంభం కాకముందే ఓ ఆరుకప్పులూ సాసర్లూ విడిగా తీసి సత్కరించేను. నీ సంగతి నాకు గుర్తుంది గానీ ఒక్కసారే డజను సెట్లు దాచేస్తే గోలయిపోతుందని భయం వేసి ఆరు సెట్లతో సరిపుచ్చాను."

మొన్నామధ్య అర్జంటుగా ఒక మహాకవిని గురించి ఒక ఆర్టికల్ రాయవలసొచ్చినప్పుడు ఆ కవిగార్ని గురించిన పూర్తి సమాచారం ఎక్కడ దొరుకుతుందా అని ఆలోచించడంలో 1975లో ఎవరో వేసిన సావనీర్ సంగతి గుర్తొచ్చింది. ఆ సావనీర్ కాపీ ఒకటి మన్మథరావు దగ్గిర దొరకొచ్చునని తోచి అతనింటికి వెళ్లేను. ఉందిట.

"ఇస్తాను గానీ, ఇదెక్కడా చెప్పకూడదు మరి" అన్నాడు మన్మథరావు.

"దీంట్లో ఉన్న వ్యాసాలు ఆధారంగా నేను ఆర్టికల్ రాస్తాను కదా. అంచేత ఈ సావనీర్ రిఫర్ చేసేనని గాని ఇది నువ్వు నాకు ఎరువిచ్చేవని గాని చెప్తే నాకే అప్రదిష్ట!" అన్నాను.

"అది కాదు. ఈ సావనీర్ కాపీ నేను (ఫలానా) లైబ్రరీలోంచి తెచ్చేశాను." అని ఆ కథ

చెప్పేడు మన్మథరావు. అయిదేళ్ల కిందట ఆ లైబ్రరీలో చూసేడు మన్మథరావు ఆ పుస్తకం. "జొన్నసేను కాడ సిన్న దానిని జూచి నిన్నటేల నుండి నిదరనేదు" అన్నట్టుగా బాధపడుతూ వుండగా ఆ లైబ్రరీకి అధికారిగా ఇతని ఫ్రెండు విశ్వనాథరావు వచ్చేడు. విశ్వనాథరావు పలుకుబడి వుపయోగించి ముందు ఆ సావనీర్ (లైబ్రరీ రిజిస్టర్ 81వ పేజీలో సంతకం పెట్టి అతని చేత కూడా పెట్టించి) ఇంటికి తెచ్చేడు. రెండేళ్ళ కిందట విశ్వనాథరావు ట్రాన్స్‌ఫర్ అయినప్పుడు మన్మథరావు అతనికి వీడ్కోలు చెప్పడానికి అక్కడికి వెళ్లి "అన్నట్టు ఆ సావనీర్-" అన్నాడు. "అది నీకు కావాలి కదా" అన్నాడు విశ్వనాథరావు. ప్యూన్ని పిల్చి ఫలానా రిజిస్టర్ తెమ్మన్నాడు. రిజిస్టర్ రాగానే "సర్లే; నేను చెక్ చేస్తాను" అని ఆ ప్యూన్ని బైటికి పంపి 81వ పేజీ చింపేశాడు.

"నీ సఫారీ సూట్ చాలా బాగా కుట్టేడోయి. మీ టైలరు" అన్నాట్ట ఒకాయన.

"అవును. బాగా కుట్టేడు."

"అతని ఎడ్రస్ నాకు చెప్పు. నేనూ ఒక సఫారీ కుట్టించుకుంటాను."

"అతని అడ్రస్ నీకు చెప్తాను గాని ఒక షరతు. నా అడ్రస్ అతనికి చెప్పనని మాటివ్వు".

(ఎందుకంటే, ఇతను ఇల్లు మారక ముందు కుట్టించుకున్న ఆ సూట్ మజూరీ ఇప్పటిదాకా ఇవ్వకుండా తిప్పించుకు తిరుగుతున్నాడు!) ★

# 91. ప్రభూ, ఏమి సెలవు?

"అనగనగా ఒక ఆఫీసు. దానికొక మేనేజరు. ఆ మేనేజరు కొక చిన్ననాటి స్నేహితుడు" అని పరమేశ్వర రావు ఏదో కథ మొదలెట్టేడు; చాలా రోజుల కిందట ఓనాడు పొద్దుపోయాక, పొద్దుపోడానికి కూర్చున్నప్పుడు.

"గోదారి గట్టుంది. గట్టు మీద చెట్టుంది. చెట్టు కొమ్మన పిట్టుంది" అని పరమేశ్వర రావు కథా కథన ధోరణిని వేళాకోళం చేసేడు వెంకట్రావు.

పరమేశ్వర్రావు ఏ కథ చెప్పదల్చుకున్నాడో తెలియదు గాని సన్యాసిరాజు ఆ "ఎత్తు" - "గడ"ని అందుకుని మాట్లాడేడు; "ఆ చిన్ననాటి స్నేహితుడేమోనూ; తన ఫ్రెండు చిన్నప్పుడు ఎంత పనికిరాని వాడని తిట్లు తిన్నా చివరికి ఒక ఆఫీసుకి మేనేజరు అయినాడు కదా అని సంతోషించి వెళ్ళి అతన్ని అడిగేడుట- "మీ ఆఫీసులో ఎంతమంది పనిచేస్తారూ" - అని! దానికీ మేనేజరు "సగంమంది" అని ఠకీమని సమాధానం చెప్పేట్ట."

ఈ ఉపాఖ్యానం నాకసలు జ్ఞాపకం రాకపోయేదే. కాని నాకు మొన్నీమధ్య ఒక గవర్నమెంటాఫీసులో పని పడ్డప్పుడు ఆ ఆఫీసుకి మేనేజరుగా నా మిత్రుడు ప్రభాకర్రావు జాయినయ్యాడని తెలియగానే గుర్తొచ్చింది. నాకు ఆ ఆఫీసులో పని పడింది కనుక "మీ ఆఫీసులో అందరూ నిజంగా పని చేస్తున్నారా, లేక సగం మంది సెలవులు పెట్టేసి సగం మంది అటూ ఇటూ పనుల మీద పోయి నిన్ను ఏడిపించుకు తింటున్నారా?" అని నేను ప్రభాకర్రావుని